క్లుప్తంగా

న్యాయమూర్తులకు సన్మానం



న్యాయమూర్తులతో జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం జిల్లా కోర్టులో నూతనంగా నియమితులైన న్యాయమూర్తులను శుక్రవారం కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కోర్టులోని లైబ్రరీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ నూతన న్యాయమూర్తులు కాటూరి బిందు, గుగులోతు గిరిజానాయక్ తదితరులను సన్మానించారు.

జాబ్‌మేళాలో ఉద్యోగాలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జాబ్ మేళాలో ఎనిమిది మందికి ఉద్యోగాలు లభించినట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. భారత్ మోటార్స్ కంపెనీ (హుందయ్) కొత్తగూడెంలో సేల్స్ కన్సల్టెన్సీలో 17 పోస్టులకు 38 మంది హాజరు కాగా ఎనిమిది మంది ఎంపికయ్యారని తెలిపారు.

యువత అవగాహన పెంచుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: యువతలో అవగాహన, జ్ఞానం పెంపొందించడానికి హెచ్ఐవీపై క్విజ్ నిర్వహించినట్లు జిల్లా వైద్యా, ఆరోగ్య శాఖాధికారి జయలక్ష్మి తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్విజ్ నిర్వహించి, బహుమతులు పంపిణీ చేశారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పుల్లారెడ్డి, డీపీఎం, జిల్లాలోని 13 కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

ఇల్లెందురూరల్: కొమరారం పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ చంద్రభాను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో క్రైమ్ రికార్డు, స్టేషన్‌లో సౌకర్యాలు, పరిసరాలను పరిశీలించారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక, చైతన్య కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పూర్తిగా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నందున అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, రహదారులపై వాహన తనిఖీలు క్రమం తప్పకుండా చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో గుండాల సీఐ రవీందర్, కొమరారం ఎస్సై నాగుల్‌మీరా పఠాన్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీలు పకడ్బందీగా నిర్వహిద్దాం..

ఇల్లెందురూరల్: పాఠశాల స్థాయి మండల, జోనల్ క్రీడలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధ్యాపకులు, ఉపాధ్యాయులు సహకరించాలని ఎంఈఓ ఉమాశంకర్ అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన క్రీడాంశాలలో వయస్సు ఆధారంగా పోటీలు నిర్వహించాలే క్రీడాశిక్షకులు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. మండల, జోనల్ స్థాయి పోటీలను సింగరేణి హైస్కూల్ మైదానంలో నిర్వహించాలని నిర్ణయించారు. ఆళ్లపల్లి ఎంఈఓ కాంతారావు, హెచ్ఎం, క్రీడాశిక్షకులు పాల్గొన్నారు.

వినియోగం పెరిగిందా.. దారిమళ్లిందా..?

- యూరియా విక్రయాలపై కొరవడిన నిఘా
- విక్రయ కేంద్రాల వద్ద నేటికీ తప్పని పడిగాపులు
- యూరియా రెట్టింపు సరఫరా.. అయినా కొరత



విక్రయానికి సిద్ధంగా ఉన్న యూరియా బస్తాలు



యూరియా విక్రయ కేంద్రం వద్ద రైతులు

ఇల్లెందురూరల్: వ్యవసాయ సాగు విస్తీర్ణంతో పోలిస్తే ఇల్లెందు మండలంలో యూరియా రెట్టింపు స్థాయిలో సరఫరా చేశామని, యూరియా విక్రయాలలో జిల్లాలోనే ఇల్లెందు అగ్రస్థానమని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆ స్థాయిలో విక్రయాలు జరిగితే నేటికీ విక్రయ కేంద్రాల వద్ద రైతులు ఎందుకు పడిగాపులు పడుతున్నారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విక్రయించిన యూరియా నేరుగా రైతుల వద్దకు చేరుతోందా.. లేక.. దారిమళ్లుతోందా అని అందరూ చర్చించుకుంటున్నారు.

గతానుభవాలే నిదర్శనం...

గతేడాది యూరియా విక్రయాల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఆన్‌లైన్‌లో ఎంట్రీలు లేకుండానే యూరియా బస్తాలు పెద్దమొత్తంలో విక్రయ కేంద్రం నుంచి తరలిపోయినట్లు గుర్తించారు. ఇలా యూరియా నేరుగా రైతుల వద్దకు కాకుండా వ్యాపారుల వద్దకు చేరినట్లు సహకార సంఘం అధికారులు విచారణ అనంతరం వెల్లడించారు. ఈ విషయంలో సొసైటీ ఉద్యోగుల సస్పెన్షన్, పోలీసు కేసులు అందరికీ తెలిసిందే. ప్రస్తుత సీజన్‌లో రైతులకు ఆధార్‌కార్డు ఆధారంగా విక్రయాలు ప్రారంభించిన అధికారులు రైతుల రద్దీ పెరగడంతో పట్టాదారు పాస్‌పుస్తకం కూడా చూపించాలని షరతు పెట్టారు. అయితే విక్రయ కేంద్రం వద్ద పట్టాదారు పాస్‌పుస్తకాల జిరాక్స్ స్వీకరించడం మినహా సరైన పరిశీలన, ప్రత్యేకంగా నమోదు లేకపోవడంతో ఒకే పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ పత్రాలు చూపించి యూరియా కొనుగోళ్లు జరిగినట్లుగా ప్రచారం జరుగుతోంది.

రెట్టింపు స్థాయిలో సరఫరా...

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఆగస్టు 22 నాటికి ఇల్లెందు మండలానికి 2,667 మెట్రిక్ టన్నుల యూరియా, 21వేల నానో యూరియా (500 ఎంఎల్) బాటిళ్లు రైతులకు విక్రయించినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఆ ప్రకారం మండలంలోని పీఏసీఎస్‌కు 1400 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు వ్యాపారులకు 1,267 మెట్రిక్ టన్నులు సరఫరా జరిగింది. ఇది 80,300 ఎకరాలకు సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. కానీ మండలంలో ప్రస్తుతం 45,417 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయని అధికారులు వెల్లడిస్తున్నారు.

కొరవడిన నిఘా..

మండలంలో సాగు విస్తీర్ణం ఆధారంగా అవసరానికి రెట్టింపు స్థాయిలో యూరియా విక్రయాలు జరిగినట్లుగా అధికారులు చెబుతున్నారు. అయినా మండలంలోని వ్యవసాయ మార్కెట్, కొమరారం, నిజాంపేట కేంద్రంలో ఏర్పాటు చేసిన యూరియా విక్రయ కేంద్రాల్లో నేటికీ రైతులు బారులు తీరుతూనే ఉన్నారు. మరి సరఫరా అయిన యూరియా ఎక్కడికి పోయింది.

అవసరానికి మించి సరఫరా చేసినా రైతులు ఎందుకు బారులు తీరుతున్నారు. బ్లాక్ మార్కెట్‌కు తరలుతోందా.. ప్రైవేటు వ్యాపారులకు చేరిందా.. లేదంటే అక్రమంగా నిల్వ చేస్తున్నారా.. వంటి అంశాలపై వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించిన దాఖలాలు లేవు. దీనిపై జిల్లా అధికారులు దృష్టి సారించడం లేదు.

విక్రయ కేంద్రాల వద్ద పడిగాపులు...

ప్రస్తుత వానాకాలం సీజన్ ప్రారంభంలో అనావృష్టి కారణంగా సాగు ఆలస్యంగా ప్రారంభమైంది. వేసిన విత్తనాలు మొలకెత్తినా వరుణుడి కరుణ లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ సమయంలో నెలరోజులుగా వర్షాలు సమృద్ధిగా కురవడంతో అన్నదాతలు పంటలకు యూరియా చల్లడం ప్రారంభించారు. దీనికోసం విక్రయ కేంద్రాలకు పరుగులు తీయడంతో అవి దొరకక ఆందోళనకు గురవుతున్నారు. దీనికితోడు వర్షాలు సమృద్ధిగా కురవడంతో వరినాట్లు కూడా పూర్తయ్యాయి. ప్రస్తుతం వరికి కూడా యూరియా అవసరం ఉండటంతో రైతులు విక్రయ కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారు.

కొరత ప్రచారంతోనే..



యూరియా కొరత తీవ్రంగా ఉందన్న ప్రచారంతోనే రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇల్లెందు మండలంలో సాగు విస్తీర్ణం ఆధారంగా అవసరానికి మించి సరఫరా చేశాం. విక్రయాల తీరును స్వయంగా పరిశీలిస్తాం. అక్రమాలు జరిగినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– లాల్‌చంద్, ఏడీఏ, ఇల్లెందు

మండపాలకు అనుమతులు తప్పనిసరి..



మాట్లాడుతున్న సీఐ ప్రతాప్

కొత్తగూడెంటౌన్: గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, పోలీసు నిబంధనలు పాటించాలని కొత్తగూడెం టూటౌన్ సీఐ ప్రతాప్ అన్నారు. శుక్రవారం రామవరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో మండప నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సీఐ ప్రతాప్ మాట్లాడుతూ.. గణేష్ మండపాల నిర్వహణకు కమిటీ సభ్యులు తెలంగాణ పోలీసుశాఖ రూపొందించిన ప్రత్యేక పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సమాచారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడానికి వీలుంటుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీఒక్కరు మట్టి ప్రతిమలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల్లో 24 గంటలూ ఒక వలంటీర్ ఉండేలా చూసుకోవాలన్నారు. మండపం వద్ద పాయింట్ పుస్తకంను ఏర్పాటు చేయాలని చెప్పారు. అనుమానాస్పద బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు డయల్ 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. టూటౌన్ ఎస్‌ఐ కిషోర్‌తో పాటు పోలీసులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు నిర్మించండి..

సింగరేణి(కొత్తగూడెం): కళాశాలలకు నూతన తరగతి గదులు కేటాయించాలని, భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు మంద నాగకృష్ణ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కళాశాలలో అదనపు గదులు నిర్మించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఒకేషనల్ తరగతి గదులు, ఆర్ట్స్ విభాగం తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని వర్షం వస్తే గోడల్లో నీరు చేరి ప్రమాదకరంగా ఉంటాయని, షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు రామవరం, లక్ష్మీదేవిపల్లిలోని హాస్టళ్లలో ఉంటున్నారని, అంతదూరం నుంచి కాలినడకన కళాశాలకు రావాల్సి వస్తోందని, కళాశాలకు దగ్గరలోనే హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న నాగకృష్ణ

సైన్స్ విద్యార్థులకు సరైన ల్యాబ్ లేక ప్రయోగాత్మకంగా కొత్త విషయాలను నేర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 12 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో హర్షవర్ధన్, సతీష్, శ్యామల, రిశ్వంత్, మౌలాలి, విఘ్నేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండప నిర్మాణానికి కర్రపూజ



పూజలో పాల్గొన్న స్థానికులు

ఇల్లెందు: పట్టణంలోని 2వ వార్డు ఇల్లెందులపాడులోని గాంధీ సెంటర్‌లో వినాయక మండపం ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం కర్రపూజ నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ కటకం పద్మావతి మాట్లాడుతూ... గణేష్ నవరాత్రి ఉత్సవాలను బస్తీవాసులు విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

పాల్వంచరూరల్: మండలంలోని యానంబైల్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్‌పీడీసీఎల్ రూరల్ ఏఈ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కిన్నెరసాని, కోడిపుంజులవాగు, పూసల తండా, రెడ్డిగూడెం, ఉల్వనూరు పరిసర గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాల పునఃప్రారంభం



పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

పాల్వంచరూరల్: గ్రామంలోని తల్లిదండ్రులు తమ బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. నాగారం గ్రామపంచాయతీ బోజ్యాతండాలో నాలుగేళ్లుగా మూతపడిన ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం పునఃప్రారంభించారు. తొలిరోజు పదిమంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ... గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు ఎవరూ రాకపోవడంతో మూసివేసినట్లు చెప్పారు. మూతపడిన ప్రభుత్వ పాఠశాలలను తెరిపించాలని విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గ్రామంలో సర్వే నిర్వహించి బడిఈడు పిల్లలను గుర్తించి మూతబడిన పాఠశాలను తెరిపించడం జరిగిందన్నారు. గ్రామంలో ఉన్న విద్యార్థులందరినీ ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించే విధంగా తల్లిదండ్రులు ముందుకు రావాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలోనే నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపి రూ.లక్షలు వృథా చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీరామ్మూర్తి, ఉపాధ్యాయులు గీత, వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాస్, భిక్షం, రాజు, స్థానికులు పాల్గొన్నారు.

యూరియా విక్రయాల్లో అగ్రస్థానం

ఇల్లెందురూరల్: యూరియా విక్రయాల్లో జిల్లాలోనే ఇల్లెందు అగ్రస్థానంలో ఉండగా గుండాల రెండో స్థానంలో ఉన్నాయని ఇల్లెందు వ్యవసాయ సహాయ సంచాలకుడు (ఏడీఏ) లాల్‌చంద్ తెలిపారు. ఇల్లెందు వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గతేడాది సెప్టెంబర్ 31 నాటికి టేకులపల్లి మండలంలో 2,271 మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా చేయగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 1,746 మెట్రిక్ టన్నులు, 10,779 నానో యూరియా (500ఎంఎల్) బాటిళ్లు, ఇల్లెందు మండలంలో గతేడాది 4,319 మెట్రిక్ టన్నులు, ఈ ఏడాది ఇప్పటి వరకు 2,667 మెట్రిక్ టన్నులు, 21వేల నానోయూరియా బాటిళ్లు సరఫరా చేసినట్లు చెప్పారు. టేకులపల్లి మండలంలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వివిధ పంటల సాగు అధికారికంగా 57,020 ఎకరాలు ఉండగా 50,249 ఎకరాలకు సరిపోను యూరియా సరఫరా చేశామన్నారు. అదేవిధంగా ఇల్లెందు మండలంలో 45,417 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగవుతుండగా ఇప్పటి వరకు 80,300 ఎకరాలకు సరిపోయే యూరియా సరఫరా చేశామని వివరించారు. ఈ లెక్కన ఇల్లెందు మండలంలో అవసరానికి కంటే రెట్టింపు స్థాయిలో యూరియా సరఫరా జరిగిందన్నారు.

పోరుబాట యాత్రకు తోడుగా రండి..



మాట్లాడుతున్న పార్థసారథి

ఇల్లెందు: విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థి పోరుబాట యాత్ర చేపట్టామని, విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. శుక్రవారం ఇల్లెందులో జరిగిన పీడీఎస్‌యూ పట్టణ కమిటీ సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు బి.సాయి, ఎ.పార్థసారథి మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి 30 వరకు చర్లలో ప్రారంభమై జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పర్యటించి విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెస్తామన్నారు.

ఖాళీగా ఉన్న డీఈఓ, ఎంఈఓ, ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్, డైట్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. శ్రావణి, భాను, విష్ణుసాయి, అఖిల్, మనీ, భార్గవి పాల్గొన్నారు.

యూరియా సరిపడా సరఫరా చేయాలి

ఇల్లెందురూరల్: వ్యవసాయానికి సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్ ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రవికుమార్‌కు అందజేశారు. పార్టీ డివిజన్ నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, యదళ్లపల్లి సత్యం మాట్లాడుతూ.. సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా నేటికీ రైతులు యూరియా కోసం పడిగాపులు పడుతున్నారని వాపోయారు. రైతుల అవసరాలను గుర్తించి సరిపడా యూరియా సరఫరా చేయాల్సిన పాలకులు తమ బాధ్యతను విస్మరించడం వల్లే రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణం స్పందించి సాగు విస్తీర్ణానికి సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బానోత్ సంతు, మోతీలాల్, మూడు మాలు, జోగ కృష్ణ, మోకాళ్ల కృష్ణ, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ఎల్‌ఈడీ లైట్ల పంపిణీ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా ప్రభావిత పాలవాగు, గడ్డిగుట్ట, జగ్గారం, మర్రిగూడెం గ్రామాల ప్రజలకు సింగరేణి డైరెక్టర్ పిపి వెంకటేశ్వర్లు శుక్రవారం సోలార్ ఎల్‌ఈడీ స్ట్రీట్ లైట్లను పంపిణీ చేశారు. అంతకంటే ముందు ఏరియాలో త్వరలో భూమిపూజ జరగనున్న వీకే–7 ఓసీ స్థలాన్ని సందర్శించారు. మాట్లాడుతూ సింగరేణి సంస్థ అందిస్తున్న సోలార్ ఎల్‌ఈడీ లైట్లను అవసరమున్నచోట అమర్చుకుని వాడుకోవాలన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రాబోయే రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలను కంపెనీ నిర్వహిస్తుందన్నారు. ఏరియా జీఎం శాలేం రాజు మాట్లాడుతూ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచనల మేరకు, సింగరేణి చైర్మన్ ఆదేశాల మేరకు ప్రభావిత ప్రజల సౌకర్యార్థం 12 ఎల్‌ఈడీ లైట్లను పంపిణీ చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సీఐ ప్రతాప్, యూనియన్ నాయకులు రజాక్, గట్టయ్య, ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏజీఎం హనుమలత, జీవీ మోహన్‌రావు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



లైట్లు అందజేస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

పల్లెల్లో సౌకర్యాలు మెరుగుపరుస్తాం..



ఇల్లెందురూరల్: పూబెల్లి గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య



జూలూరుపాడు: అజొల్లా ఫిట్‌ను పరిశీలిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీల్లో సౌకర్యాలు మెరుగుపర్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. రూ.20 లక్షలతో నిర్మించిన పూబెల్లి గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని పనుల జాతర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కార వేదికగా రూపుదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శి బాలకృష్ణ, చీమల నాగరత్నమ్మ పాల్గొన్నారు.

టేకులపల్లి: పనుల జాతర కార్యక్రమాన్ని టేకులపల్లి మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య టేకులపల్లి, కోయగూడెం పంచాయతీలలో పశువుల షెడ్ల ప్రారంభోత్సవం, దాసుతండా పంచాయతీలో పశువుల షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మల్టీ పర్పస్ వర్కర్లు, ఉపాధి హామీ పథకంలో ఎక్కువ రోజులు పని చేసిన కూలీలను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, ఎంపీడీఓ బైరు మల్లేశ్వరి, ఎంపీఓ జేఎల్ గణేష్ గాంధీ, ఏపీఓ కాళంగి శ్రీనివాస్, ఏఓ అన్నపూర్ణ, ఈసీ తిరుపతి, ఏఎంసీ చైర్మన్ రాంబాబు, ఆత్మ చైర్మన్ మంగీలాల్, సొసైటీ లక్కినేని సురేందర్, రెడ్యానాయక్, ఈది గణేష్, కార్యదర్శి ఉప్పు దీప్తి, ఎస్ఐ రాజేందర్ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన పనుల జాతర కార్యక్రమంలో శుక్రవారం జగన్నాథపురం, తోగ్గూడెం గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఎంపీడీఓ కె.విజయభాస్కర్ రెడ్డితో కలిసి కొత్వాల పాల్గొని పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ చెన్నకేశవరావు, ఏపీఓ పారండ్ల రంగా, ఆర్టీఏ సభ్యులు బాదర్ల జోషి, ఈసీ పుల్లయ్య, కార్యదర్శి రవికుమార్, క్షేత్ర టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సుజాతనగర్: ఉపాధి పనుల జాతరలో కొత్తగూడెం కార్పొరేషన్‌లో విలీనం అయిన ఏడు గ్రామ పంచాయతీలు మినహా 13 గ్రామ పంచాయతీల పరిధిలో శుక్రవారం ఉపాధి హామీ పనులకు శ్రీకారం చుట్టారు. పాత అంజనాపురంలో ఓ రైతు పొలంలో మండల ప్రత్యేకాధికారి త్రినాథ్‌బాబు పామాయిల్ మొక్కలు నాటి ఉపాధి పనులను ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ వీరహనుమంతరావు, ఎంపీడీఓ భారతి పాల్గొన్నారు.

జూలూరుపాడు: పనుల జాతర మహోత్సవంలో భాగంగా పడమటనర్సాపురం గ్రామంలో శుక్రవారం వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పశువుల షెడ్డు, పశువుల పోషకాహారం అజోల్లా ఫిట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాళ్లూరి రవి, తహసీల్దార్ టి.శ్రీనివాస్, ఎస్ఐ బాదావత్ రవి, ట్రాన్స్‌కో ఏడీఈ రవికుమార్, ఎంపీఓ తులసీరామ్, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లు, పశువైద్యాధికారి డాక్టర్ బానోత్ బద్దూలాల్, ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్ రావు, ఎంఈఓ బానోత్ జుంకీలాల్, ఇరిగేషన్ ఏఈ మీనా, హౌసింగ్ ఏఈ గాడ్విన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ యాసిన్ పాల్గొన్నారు. భోజ్యాతండా గ్రామ పంచాయతీలో పనుల జాతర కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షుడు వాంకుడోత్ కిషన్, సెక్రటరీ వెంకట్ వెనకతండాలో మొక్కలు నాటారు. పంచాయతీ సిబ్బంది మహంకాళి, భద్రం, ప్రజలు పాల్గొన్నారు.

ఇకనైనా మినీ స్టేడియం పూర్తయ్యేనా?

- రూ.1.56 కోట్ల నిధులు కేటాయింపు
- తాజాగా మంత్రి పొంగులేటి శంకుస్థాపన



అసంపూర్తిగా ఉన్న ఇల్లెందు మినీ స్టేడియం

ఇల్లెందు: నిన్నటి వరకు నిధులు లేక అసంపూర్తిగా మిగిలిన మినీ స్టేడియం ఇకనైనా పూర్తయ్యేనా అని క్రీడాకారులు ఎదురు చూస్తున్నారు. తాజాగా ఎమ్మెల్యే కోరం కనకయ్య రూ.1.56 కోట్లు నిధులు కేటాయించారు. వాటితో చేపట్టబోవు పనులకు రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఇప్పటికైనా మినీ స్టేడియం నిర్మాణం పూర్తయితే ఆటలాడుకునేందుకు క్రీడాకారులు ఎదురు చూస్తున్నారు. దీనికి టెండర్ కూడా పూర్తి చేశారు. రూ.1.56 కోట్లతో తొమ్మిది రకాల పనులు చేపట్టాల్సి ఉంది. స్టేడియం చుట్టూ కాంపౌండ్, వాకింగ్ ట్రాక్, ఉడెన్ ఫ్లోర్, డ్రెయినేజీ, ఇండోర్, అవుట్ డోర్ జిమ్‌లు, లైటింగ్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ కోర్టులు, ఇండోర్ స్టేడియంలో లైటింగ్, మరుగుదొడ్లు పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే ఇండోర్ స్టేడియం పనులు తుది దశలో ఉన్నాయి. ఈ పనులు పూర్తయితే ఇక ఆటలాడుకునే అవకాశం ఉంటుంది. వచ్చే జనవరిలో మినీ స్టేడియంలో ఆటలాడుకోవచ్చని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

స్టేడియం ఉంటే ..

యువతకు తగిన క్రీడా సదుపాయాలు ఉంటే ఏదైనా ఒక క్రీడా రంగంలో రాణించే అవకాశం ఉంటుంది. క్రీడాకారులు తమలోని సత్తాను చాటుకునే అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో వాలీబాల్, క్రికెట్ మినహా ఇతర ఆటలు ఉంటాయి. నియోజకవర్గ కేంద్రంలో మినీ స్టేడియం ఉంటే ఎంతోమంది క్రీడాకారులు తయారయ్యే అవకాశం ఉంటుంది. ఇల్లెందు మినీ స్టేడియం ఏడేళ్లుగా సరిపడా నిధులు లేకపోవటం.. బిల్లులు సకాలంలో అందకపోవటం వెరసి మినీ స్టేడియం ముందుకు సాగడం లేదు.

పునాది పడింది ఇలా...

2016లో ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో మినీ స్టేడియాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. రూ.2.65 కోట్లు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ (స్పోర్ట్స్ అథారిటీ) నిధులు కేటాయించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇల్లెందులో 80 శాతం పూర్తి కాగా పాల్వంచ, మణుగూరు, అశ్వారావుపేటలలో నిధులు ఉన్నంత వరకు 50 శాతానికి పైగా పూర్తి చేశారు. ఇక భద్రాచలంలో స్థలం లేక పనులు ప్రారంభించ లేదు.

పూర్తయితే ..

మినీ స్టేడియం పూర్తయితే క్రీడాకారులకు ఎంతో ఉపయోగం ఉంటుంది. వాకింగ్ ట్రాక్ నిర్మాణం జరుగుతోంది. టేబుల్ టెన్నిస్ కోర్టు అందుబాటులో ఉంటుంది. ఎండ, వాన, చలికి ఇండోర్ స్టేడియం ఎంతో ఉపయోగంగా ఉంటుంది. అలాగే జిమ్, కబడ్డీ కోర్టు, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, షటిల్ కోర్టు కూడా ఇందులో ఉంటాయి. ప్రత్యేకంగా వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు కోచ్‌లు కూడా ఉంటారు.

నాలుగు నెలల్లో పూర్తి చేస్తాం..



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా మిగులు పనులకు శంకుస్థాపన జరిగింది. మినీ స్టేడియంలో తొమ్మిది రకాల అసంపూర్తి పనులు ఉన్నాయి. వాటన్నింటినీ వచ్చే నాలుగు నెలల్లో పూర్తి చేసి కొత్త సంవత్సరంలో స్టేడియాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం. క్రీడాకారులకు ఉపయోగపడేలా మినీ స్టేడియం నిర్మాణం పూర్తవుతుంది.

– జి.రాజు, ఏఈ, పంచాయతీ రాజ్